# విజయవాడ వార్త



## 4గు రకాల చెత్త బుట్టలను ఏర్పాటు చేయండి : కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్,మే 6,ప్రభాతవార్త :** సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ 2026 కొత్త నియమావళి ప్రకారం నగరంలో నాలుగు రంగుల చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం ప్రధాన కార్యాలయం లోని తన ఛాంబర్‌లో శాఖాధిపతులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యర్థ పదార్థాల నిర్వహణ 2026 నియమావళి ప్రకారం నగర పరిధిలో గల మూడు చెత్త బుట్టలను నాలుగు చెత్త బుట్టలుగా చేయాలని, ఎరుపు, పచ్చనీలంతో పాటు నలుపు రంగు గల చెత్తబుట్టను కూడా వాడాలని అధికారులను ఆదేశించారు. కూరగాయల వ్యర్థాలు, పళ్ళవ్యర్థాలు లాంటి తడి చెత్త, పచ్చబుట్టలో, పేపర్‌ముక్కలు, అట్టముక్కలు, ప్లాస్టిక్ బాటిల్ లాంటి పొడి చెత్త నీలం బుట్టలో, డైపర్, శానిటరీ నాప్‌కిన్స్, వాడి పడేసిన కాటన్ బ్యాండేజ్ లాంటి చెత్త ఎరుపు బుట్టలో, పగిలిపోయిన బల్బులు, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వ్యర్థాలు, పెయింట్ డబ్బాలు, నెయిల్ పాలిస్ లాంటివి నలుపు రంగు గల చెత్తబుట్టలో వేసేటట్టు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా త్రాగునీటి సరఫరాలో, పార్కుల నిర్వహణ, సమ్మర్ క్యాంపు, మొక్కల సంరక్షణ వంటి విషయాల్లో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమీషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంఛార్జి ఇంఛార్జి పి.సత్యకుమారి, సూపరిండెంటెంట్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ కమీషనం (రెవిన్యూ) జి.సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) ఎం.విజయలక్ష్మి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.



## వైద్య ఖర్చులకు రూ.50వేలు అందజేత

**తిరువూరు, మే 6, ప్రభాతవార్త :** తిరువూరు మండలానికి చెందిన సిఐటియు నాయకుడు ఆకుల రవి మనవడు త్రిలోక్ కళ్యాణ్ వైద్య ఖర్చుల నిమిత్తం సేకరించిన రూ.43,500కు యూటీఎఫ్ తిరువూరు మండలశాఖ నుంచి రూ.6,500 విరాళం జతచేసి మొత్తం రూ.50,000ను అందజేశారు. తిరువూరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని అందజేశారు. సహకరించిన నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులందరికీ మండల శాఖ తరఫున అధ్యక్షుడు పి.వెంకటస్వామి కృతజ్ఞతలు తెలిపారు.



## ఇంటి గోడలపై జనాభా లెక్కల గుర్తులు,అంకెలు వేయడానికి సహకరించండి

### కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్,మే 6,ప్రభాతవార్త:** ఎన్యూమరేటర్లు ఇంటి గోడలపై జనాభా లెక్కల అధికారుల చిహ్నాలు, అంకెల వేయడానికి వారిని ప్రజలు అనుమతించాలని కమీషనర్ ధ్యానచంద్ర కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో జనగణన కార్యక్రమం మే 4 నుండి పూర్తి స్థాయిలో కొనసాగుతోందన్నారు. జనాభా సేకరణను ప్రశ్నోత్తరాల రూపంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 51,055 మంది ప్రజల వివరాలను నమోదు చేసామని తెలిపారు. జనగణన ప్రక్రియను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లు ఇంటి వద్దకు వచ్చినపుడు వారి అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వడంతో పాటు, ఇంటి గోడపై జనాభా లెక్కల అధికారుల చిహ్నాలు, అంకెలు వేయడానికి అనుమతించాలన్నారు. ఇంటి గోడపై వేసే గుర్తులు, అంకెల ద్వారా ఆ ఇంటిలో నివసిస్తున్న సభ్యులు జనాభా లెక్కల ప్రక్రియలో పాల్గొన్నట్లు గుర్తింపుగా నమోదు అవుతుందని తెలిపారు. ఈ గుర్తులు పూర్తిగా అధికారిక అవసరాల కోసమే వినియోగించబడతాయని, ప్రజలు ఎటువంటి అపోహలకు లోను కాకుండా సహకరించాలని కోరారు.

## నేడు ఆకాశవాణిలో రఘునందన్ కవితలు ప్రసారం

**తిరువూరు, మే 6, ప్రభాతవార్త :** తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ రచించి పఠించిన కవితలు గురువారం రాత్రి 8 గంటలకు ఆకాశవాణి విజయవాడ ఎ కేంద్రంలో ప్రసారం కానున్నట్లు రఘునందన్ తెలిపారు. పలు సామాజిక అంశాలపై రచించిన కవితలను గత నెల 20న విజయవాడ ఆకాశవాణి వారు రఘునందన్‌ను ఆహ్వానించి తమ కేంద్రంలో రికార్డు చేయడం జరిగింది. 1983 నుంచి రఘునందన్ రచించిన అనేక వందల కవితలు కథానికలు వ్యాసాలు ఆకాశవాణిలో ప్రసారం కాబడ్డాయి. ఈ సందర్భంగా తిరువూరు రచయితల సంఘం కార్యవర్గం మరియు పలువురు సాహిత్యాభిమానులు రఘునందన్ ను అభినందించారు.

## సాంకేతిక ప్రాణాలు కాపాడటానికి కూడ ఉపయోగపడుతుంది : సిపి రాజశేఖరబాబు

-చిన్నారికి 'త్రినేత్ర'గా నామకరణం చేసిన వైనం
-వేగంగా స్పందించి చిన్నారి ఆచూకిని కనుగొన్న కృష్ణలంక సిఐ నాగరాజు

**విజయవాడ కార్పొరేషన్,మే 6,ప్రభాతవార్త :** సాంకేతికత కేవలం నేరస్థులను పట్టుకోవడానికే కాదు, ప్రాణాలను కాపాడటానికి కూడా ఉపయోగపడుతుందని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశం లోని బాత్రూంలో



అప్పుడే పుట్టిన పసికందును వదిలి వెళ్ళిన ఘటనలో సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు కృష్ణలంక సిఐ అత్యంత వేగంగా స్పందించి చిన్నారిని రక్షించి, వారి తల్లిదండ్రులను గుర్తించి కౌన్సిలింగ్ అనంతరం క్షేమంగా వారి చెంతకు చేర్చారు. దర్యాప్తులో భాగగా చిన్నారి లభ్యమైన వెంటనే సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డిసిపి కృష్ణకాంత్‌పటేల్ సూచనలతో సౌత్ ఏసిపి లతాకుమారి పర్యవేక్షణలో కృష్ణలంక సిఐ నాగరాజు తన సిబ్బందితో వేగంగా స్పందించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరంలో ఏరా ఊపటు చేసిన సిసి కెమేరాలను ఆధారంగా చేసుకొని, పుటేజిని నిశితంగా పరిశీలించి, పసికందును వదిలి వెళ్ళిన వారిని గుర్తించి, కౌన్సిలింగ్ అనంతరం పాపను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల తక్షణ స్పందన, మానవీయ ధృక్పథాన్ని అభినందిస్తూ పాలకొల్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ ఇతర నాయకులతో బుధవారం సిపి రాజశేఖరబాబుని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతు తెలియచేశారు. అణగారిన వర్గాల పట్ల ఆపదలో ఉన్న వారి పట్ల పోలీసులు చూపుతున్న చొరవను ఈ



సందర్భంగా వారు కొనియాడారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి సిపి రాజశేఖరబాబును పాపకు పేరు పెట్టలమని కోరగా, మూడవ కన్ను లాంటి సిసి కెమేరాల ద్వారా పాప కుటుంబ సభ్యులను గుర్తించడం జరిగినందున, సిసి కెమేరాల ప్రాధాన్యతను చాటి చెప్పేలా సదరు పాపకు 'త్రినేత్రి' అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక భాధ్యతగా తమ ఇళ్ళు, వ్యాపార సంస్థల వద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ ఘటనలో తల్లిదండ్రులను గుర్తించి పాపను తల్లిదండ్రుల వద్దకు చేర్చడంగా కీలకంగా వ్యవహరించిన సిఐ నాగరాజును ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిపి కృష్ణకాంత్‌పటేల్, కృష్ణలంక సిఐ నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్, పాప కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వాడుక నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలి

### కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మే 6,ప్రభాతవార్త :** నగరం లోని వాడుక నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం ప్రధాన కార్యాలయం లోని తన ఛాంబర్ వద్ద ఉన్న సమావేశపు గదిలో యూనిడో ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యూనిటో నిధులతో చేపట్టిన రామలింగేశ్వరనగర్‌లో 20 యంఎల్‌డి సామర్థ్యం గల సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, సింగ్‌నగర్, జక్కంపూడి, రామలింగేశ్వరనగర్‌లో గల గ్యాస్ జనరేషన్ ప్లాంట్ గురించి సమీక్షించారు. జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేసి త్వరగా నగరం లోని వాడుక నీరు మొత్తం శుద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత కూడా యునిడో వారి తరపు నుండి మరిన్ని ఇటువంటి ప్రాజెక్ట్‌లు విజయవాడ నగరపాలక సంస్థ సౌజన్యంతో చేసేటట్టు చర్యలు తీసుకోవాలని యూనిడో వారిని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఇంఛార్జి పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేఖ, యూనిడో ప్రతినిధులు డాక్టర్ ఎంపి సింగ్, దీపిక, ఎన్‌యూ గౌరవ్ వర్మ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు జిల్లా కలెక్టర్

**మంగళగిరి, మే 6, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13వ తేదీన మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో పర్యటించనున్ననేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పర్యటన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. రాష్ట్ర



ముఖ్యమంత్రి ఒక ప్రైవేటు ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటు పాటు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళం

### పల్నాడు జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందజేసిన సామినేని

**చిలకలూరిపేట, మే 6,ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారంగా గుంటూరు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సామినేని కోటేశ్వరరావు రూ.10 లక్షల సీఎస్‌ఆర్ నిధులను ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం మండలం గోపాలంవారిపాలెంలోని టెక్స్‌టైల్ పార్కును జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా సామినేని కోటేశ్వరరావు కలెక్టర్‌ను కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. అనంతరం ఆయన జిల్లాలో నూలు మిల్లుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.



## పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

### ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

**పొన్నూరు, మే 6,ప్రభాతవార్త:** ఎన్నికల హామీలు, ప్రజల ఆకాంక్షలే తన తొలి ప్రాధాన్యాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కోసం ముఖ్యమంత్రి తదితర మంత్రులను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ కలిసినట్లు చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు, ఆమోదాలు, నిధుల కేటాయింపులు వంటి అనేక అంశాలపై జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా ఇంచార్జి మంత్రి, పార్లమెంట్ సభ్యునితో సహా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లను కలిసి చర్చించడం జరిగింది. పార్టీ బలోపేతం, కార్యకర్తల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన వంటి అంశాలపై చర్చించారు. పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి వివిధ పనుల కోసం రూ.265కోట్లు నిధులను, పరిపాలనా అనుమతులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ వివరించారు. అభివృద్ధి పనుల వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నల్లా డ్రెయిన్ అభివృద్ధి, నల్లా డ్రెయిన్ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, మంగళగిరి, చేబ్రోలు మండలాల్లో నీటి ఎద్దడిని నివారించడానికి, భూసేకరణ, అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దీని అంచనా వ్యయం రూ.54.75కోట్లు. సుద్దపల్లి, ములుకుదురు-1 ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయడం ద్వారా సుమారు 1160ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. దీని వల్ల నాలుగు గ్రామాల్లోని 850మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీని వ్యయం రూ.7.50కోట్లు. గుంటూరు-బాపట్ల(సూర్యలంక) రహదారి పనులు: నారాకోడూరు నుండి పొన్నూరు వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేయడంతోపాటు బైపాస్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు పిపిపి పద్ధతిలో రూ.185కోట్లు వ్యయంతో చేపట్టాలని ప్రతిపాదన. కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం: నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో రూ.7.35 అంచనా వ్యయంతో 29కమ్యూనిటీ హాళ్ళను నిర్మాణం చేపట్టనున్నారు. ఆటోనగర్ ఏర్పాటుకు



రూ.10కోట్లు కేటాయించారు. ప్రస్తుతం దీని కోసం అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఉప్పలపాడు పక్షుల కేంద్రం అభివృద్ధికి రూ.0.90కోట్లు ప్రతిపాదన వంటివి ప్రధానాంశాలుగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నిధులను కోరారు.

## జెఎల్‌ఆర్ ఇండియా ప్రకటన రేంజ్ రోవర్ సిబియూ సవరణలు

**విజయవాడ, మే 6, ప్రభాతవార్త :** ఇండియా యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) అమలును దృష్టిలో ఉంచుకుని యూకె నుంచి దిగుమతి అయ్యే రేంజ్ రోవర్ సీబీయు మోడళ్ల ధరలను జెఎల్‌ఆర్ ఇండియా సవరించి రేంజ్ రోవర్ ఎస్వీ, రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ ధరలు తగ్గించబడ్డాయి. ఇందులో భాగంగా గ్లోస్ మరియు సాటిన్ ఫినిష్‌లలో లభించే ఎస్వీ అల్ట్రా మెటాలిక్ పెయింట్‌లను ఇప్పుడు మొదటిసారిగా ప్రామాణిక ఫీచర్‌లుగా అందిస్తున్నారు. అలాగే రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ ధర తగ్గించబడిందని జేఎల్‌ఆర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజన్ అంబా తెలిపారు.

## పసుపు పంట పై రైతులకు అవగాహన

**రేపల్లె, మే 6, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా లాం హార్టికల్చర్ రీసెర్చ్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరులో బుధవారం పసుపు పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పసుపు నాట్లు, సాగుకు సంబంధించిన ఆధునిక ప్రో ట్రే విధానాన్ని శాస్త్రవేత్తలు వివరించారు. విత్తన వినియోగాన్ని తగ్గించుకునే పద్ధతి, మొక్కల పెరుగుదలను మెరుగుపర్చుకోవడం వంటి విధానాన్ని తెలిపారు. పసుపులో రైజోమ్ రాట్ వ్యాధిని నివారించేందుకు ట్రైకోడెర్మా బయో పురుగుమందు వినియోగంపై రైతులకు తగిన సూచనలిచ్చారు. 20 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు ఉచితంగా బ్యాటరీ స్ప్రేయర్లు, బయో ఎరువులు, 50 కిలోల వంతున నాణ్యమైన పసుపు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.పద్మలత, డాక్టర్ తనూజప్రియ, డాక్టర్ రాధిక, కొల్లూరు హార్టికల్చర్ అధికారి విహెచ్ఎ సాగర్, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం రైతులకు,రైతు కూలీలకు ఎంతో ఉపయోగం

**నిజాంపట్నం, మే 6, ప్రభాతవార్త:** రైతులకు, రైతు కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉపాధి హామీ పథకం పనులు ఉన్నాయని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఆముదాలపల్లిలో ఉపాధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని లభించటమే కాకుండా కాలవలకు త్వరగా సాగు నీరు వస్తుందని ఆయన అన్నారు. కాలవలకు సకాలంలో నీరు అందితే పంటలు పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ బి రామకృష్ణ, ఎఫ్ఎ నర్రా వంశీ, తెదెపా నాయకులు, కార్యకర్తలు, కూలీలు పాల్గొన్నారు.



## రెండేళ్ళ తరువాత పరీక్షలు..?

### ఏఎన్‌యు తీరుపై విద్యార్థుల మండిపాటు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే6,ప్రభాతవార్త:** పరిక్షా భవన్ అధికారుల నిర్లక్ష్యంతో పరీక్షలకు నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్ళ 2నెలలు గడిచిన తరువాత పరీక్షల నిర్వహణకు టైం టేబుల్ ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సిఇగా బి.నరసారెడ్డి విధులు నిర్వహిస్తున్న సమయంలో పిజి ఆర్ట్స్, సైన్స్, ఎల్ఎల్ఎం, ఎంసిఏ, ఎంబిఏ, ఎంయిడి, పిజి ప్రవేట్ స్టడీ, బిపిఇడి, డిపిఇడి, ఎంపిఇడి కోర్సులు పూర్తిచేసి ఫెయిల్ అయిన వారికోసం వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షలు నిర్వహించేందుకు 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటినుంచి నేటివరకు ఈ పరీక్షలు




జరగలేదు. ఆతరువాత సిఇగా వచ్చిన అధికారులు రెగ్యులర్ పరీక్షలపై దృష్టిసారించారేగానీ, వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షలను పట్టించుకోలేదు. ఏళ్ళు గడిచినా అభ్యర్థులు వేడుకుంటున్నా అధికారులు మాత్రం చూద్దాం, పరీక్షలు పెడదాం అంటూ కాలయాపన చేసుకొచ్చారు. తీరా పదవీకాలం పూర్తయ్యేనాటికి హడావిడిగా పరీక్షలు నిర్వహించాలి, కొత్త నోటిఫికేషన్‌లు ఇవ్వాలి అంటూ హంగామా చేశారు. దీంతో వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షల టైంటేబుల్ ప్రకటించారు. ఇదంతా ఒక విభాగం చేస్తే పరీక్షలు నిర్వహణ మాత్రం కోఆర్డినేటర్ కార్యాలయం చేయాల్సి వచ్చింది. పరిక్షా పేపర్ల రూపకల్పనపై ప్రతిష్టంబన నెలకొంది. కోఆర్డినేటర్ కార్యాలయం తాము ఇంత హడావిడిగా ప్రశ్నాపత్రాలు రూపకల్పన చేయడం కుదరదని, సిలబస్ మారిందని, తదనుగుణంగా ప్రశ్నాపత్రాలు రూపొందించాల్సి ఉంటుందని తేల్చిచెప్పినట్లు సమాచారం. తమకు ఎటువంటి సమాచారం లేకుండ టైం టేబుల్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించినట్లు వినికిడి. దీనికి పిజి పరీక్షల విభాగం ఇప్పటికే సంవత్సరాలు గడిచాయి ఇంకా సమయం కోరితే అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని సమాదానం ఇవ్వడంతో కోఆర్డినేటర్ కార్యాలయం ప్రమేయం లేకుండా టైం టేబుల్ ఇవ్వడం సరికాదని, పరీక్షలు ఎలా నిర్వహిస్తారో చూస్తామని చెప్పినట్లు వేగుల సమాచారం. టైంటేబుల్ ఇచ్చాక పరీక్షలు నిర్వహించాల్సిందే అంటూ పీజీ విభాగం కూడా సమాదానం ఇవ్వడంతో విషయం చిలికిచిలికి అధికారుల చెంత చేరింది. వారు పీజీ విభాగం అధికారులను, కోఆర్డినేటర్ కార్యాలయ అధికారులను పిలిచి శాంతియుత చర్చలు జరపడంతో పీజీ విభాగం పరీక్షల నిర్వహణ షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ముందుగా ప్రకటించినట్లు ఈనెల 5నుంచి పరీక్షలు జరగాల్సి ఉండగా వాటిని 14వ తేదీ నుంచి నిర్వహించేందుకు అంగీకారం కుదిరిందని తెలిసింది. కాగా రెండేళ్ళ క్రితం పరీక్షల షెడ్యూల్ ఇస్తే ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నామని అభ్యర్థులకు సమాచారం వెళ్ళడంతో విస్తుపోయిన అభ్యర్థులు 'కన్నారా నాగార్జునలో లీలలు' అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బుధవారం పలువురు అభ్యర్థులు పరిక్షాభవన్‌కు వచ్చి వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షల వివరాలు కోరడంతో అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కల్పించుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

**ఏఎన్‌యు పీజీ వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్ విడుదల**

వర్సిటీ పరిధిలో పీజీ కోర్సులకు వన్‌టైం ఆపర్చునిటీ ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. బి.ఫార్మశీ, ఎం.ఫార్మశీ, ఎల్ఎల్‌బి, బిఇడి, ఫార్మా.డి, బి.టెక్, ఎం.టెక్ కోర్సులకు అవకాశం కల్పించామన్నారు. పరీక్షలు జూలై 13 నుంచి జరుగుతాయని పేర్కొన్నారు. బి.ఫార్మశీ కోర్సుల్లో ఓఆర్/ఎన్ఆర్/ఆర్ఆర్ అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మూడు పేపర్లలోపు ఉంటే రూ.6వేలు, ఆ తరువాత ఒక్కో పేపర్‌కు రూ.2వేలు ఫీజుగా నిర్ణయించారు. ఫీజులను జూన్ 26లోగా చెల్లించాలని, రూ.500 అపరాదంతో 27లోగా చెల్లించవచ్చునన్నారు. ఎం.ఫార్మశీలో పేపర్లకు రూ.6వేలు, ఆతరువాత ఒక్కోపేపర్‌కు రూ.1వెయ్యిలను జూన్ 26లోగా చెల్లించాలన్నారు. 3ఏళ్ళ, 5ఏళ్ళ ఎల్ఎల్‌బి కోర్సులకు 4 పేపర్ల లోపు రూ.6వేలు, ఆ తరువాత ఒక్కో పేపర్‌కు రూ.10వెయ్యి చొప్పున, మూట్ కోర్టుకు రూ.1వెయ్యి, నాన్ అప్పియరెన్స్ ఫీజు రూ.2420, జూన్ 26లోగా చెల్లించాలన్నారు. అలాగే బియిడి కోర్సుకు 3పేపర్ల లోపు రూ. 6వేలు, ఆపై అదనపు పేపర్‌కు రూ.1వెయ్యి, నాన్ అప్పియరెన్స్ ఫీజు రూ.2420 చొప్పున చెల్లించాలన్నారు. ఈ పరీక్షలకు సంబందించి పూర్తి సమాచారం వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని సిఇ తెలిపారు.

## కంట్రోలర్ చికిత్సతో ఉబ్బసం రోగుల్లో మెరుగైన ఫలితాలు

**విజయవాడ, మే 6, ప్రభాతవార్త :** క్రమం తప్పకుండా ప్రిస్క్రైబ్ చేసిన యాంటి ఇన్‌ఫ్లమేటరీ ఇన్‌హేల్ చేసే థెరపీలకు సపోర్ట్ అందిస్తుందని ఇది ఉబ్బసం లక్షణాలు నివారణతోపాటు దీర్ఘ పరిస్థితిగా మేనేజ్ చేయడానికి అవసరమని పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.అనిల్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఉబ్బసం దినం 2026న గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా(జీనా) యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఇన్‌హేల్ చేసే చికిత్సకు యాక్సెస్ పొందే అవసరం వైపు మన దృష్టిని ఆకర్షిస్తోందని, సిప్లా బెరోక్ జిందగీ, ట్యూఫీస్ వంటి ఇనిషియేటివులు అవగాహన కలిగించే కార్యకలాపాలలో ఛాంపియన్లు నిలుస్తున్నాయన్నారు.

# ఏఎన్‌యు పరిధిలో ఓడిల మాయాజాలం..!

- అనుబంధ కళాశాలల ఇష్టారాజ్యం
- లబోదిబోమంటూ విలపిస్తున్న విద్యార్థులు
- రోజుకు కనీసం 10 డూప్లికేట్ ఓడిలు జారీ
- ఈ విధానంతో వర్సిటీకి ఏడాదికి రూ.2కోట్లు నష్టం..!

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే6, ప్రభాతవార్త:** వర్సిటీ పరిధిలో యూజి, పీజీ, బి.టెక్, ఫార్మశీ, బియిడి వంటి కోర్సులకు సంబందించి విద్యార్థులకు అందించే ఓడి (ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్)ల మాయాజాలం నడుస్తుంది. గత కొన్నేళ్ళ వరకు ఏ కోర్సు విద్యార్థులైనా వర్సిటీలోనే ఓడిలను తీసుకోవాలనే నిబంధన ఉండగ అటానమస్ (స్వయంప్రతిపత్తి) కలిగిన కళాశాలలకు మినహాయింపు ఉంది. రెగ్యులర్, ప్రవేట్, అనుబంద కళాశాలలన్నీ వర్సిటీ నుంచే ఓడిలను తీసుకోవాలి. వర్సిటీలో ఉద్యోగులు ఓడిలకు వచ్చే వారి నుంచి లంచం తీసుకుంటున్నారనే అభియోగాలతో గడిచిన కొద్ది సంవత్సరాల నుంచి ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థుల ఓడిలను కళాశాలలకు పంపేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇదిబాగానే ఉందని అప్పట్లో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రానురాను కళాశాలల తీరు మారింది. వర్సిటీ నుంచి ఓడిలను తీసుకెళ్తున్న కళాశాలలు విద్యార్థులకు వారి ఓడీలను ఇచ్చేందుకు ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్న సందర్భాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కళాశాలల్లో కనీసం రూ.5వేలు చెల్లించి మరీ ఓడిలను తీసుకునే పరిస్థితి నెలకొంది. అదే యూనివర్సిటీకి వస్తే రూ. 1వెయ్యిలోపే ఫీజులు ఉండటం గమనార్హం. కళాశాలల్లో అంతఫీజులు చెల్లించలేని విద్యార్థులు వర్సిటీకి వచ్చి తమకు ఓడి కావాలని దరకాస్తు చేసుకుంటున్నారు. వారి దరకాస్తులను పరిశీలించిన సంబందింత సెక్షన్ అధికారులు మీ ఓడిలు ఇప్పటికే కళాశాలలకు వెళ్ళాయని ఇక్కడ



మరొకసారి ఓడి జారీ చేయడం కుదరదని చెప్తున్నారు. దీంతో విద్యార్థులు కళాశాలలకు వెళ్ళి తమ ఓడిలు వర్సిటీ ఇక్కడికి పంపినట్లు అధికారులు చెప్తున్నారని కళాశాలలకు విన్నవించుకోగా వారు బేరం కుదిరితే కనీసం రూ.5వేలు తీసుకుని ఓడిలు ఇవ్వడం, కుదరకపోతే మీ ఓడిలు మా దగ్గరలేవు అంటూ ఒక లెటర్‌ను వారికి ఇచ్చి యూనివర్సిటీ నుంచే తీసుకోండని సమాదానం ఇస్తుండటంతో చేసేది లేక తమకు డూప్లికేట్ ఓడిలు జారీ చేయాలని యూనివర్సిటీకి విన్నవించుకుంటున్నారు. ఇలా రోజుకు సుమారు 10 నుంచి 15 వరకు ఓడిలు ఇవ్వాల్సిన పరిస్తితి నెలకొంది. యూనివర్సిటీ జారీ చేసే ఓడిలు కళాశాలలకు పంపడంవల్ల యూనివర్సిటీకి ఒక్కో ఏడాదికి సుమారు రూ.2కోట్లు నష్టం వాటిల్లుతుందని ఒక అంచనా ఉంది. అప్పటి అధికారుల నిర్ణయం వల్ల ఇప్పటికే వర్సిటీ సుమారు రూ.15 నుంచి 20 కోట్లు నష్టపోయినట్లు తెలుస్తోంది. ఈ విధానం వల్ల విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. కళాశాలల్లో అధికంగా ఫీజులు చెల్లించే స్తోమత లేకపోవడం, యూనివర్సిటీకి వస్తే డూప్లికేట్ ఓడిలు ఇస్తామనడంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు. కష్టపడి చదివి డిగ్రీలు పూర్తిచేస్తే చివరకు డూప్లికేట్ ఓడిలు తీసుకునేదుస్తితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ఓడిలు కళాశాలలకు పంపకుండ యూనివర్సిటీ నుంచే జారీ చేసే విధానం తిరగి ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. తద్వారా విద్యార్థులు ఇబ్బందులు పడకుండ ఉంటారు, అలాగే యూనివర్సిటీకి ఆర్థిక నష్టం తగ్గుతుందని అధికారులు సైతం పేర్కొంటున్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్

**పొన్నూరు, మే 6,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ లభించినట్లు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి అంపసాని చెన్నయ్య, డాక్టర్ కే.చంద్రశేఖర్‌లు సంయుక్తంగా ప్రతిపాదించిన పరిశోధనకు ఈ పేటెంట్ మంజూరైనట్లు వెల్లడించారు. పోర్టబుల్ సాయిల్ పెస్టిసైడ్ మానిటరింగ్ అండ్ అనాలిసిస్ కిట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ సంస్థ పేటెంట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పేటెంట్‌కు 20సంవత్సరాలపాటు హక్కులు ఉండనున్నట్లు



ఆయన పేర్కొన్నారు. ఈ కిట్ వ్యవసాయ భూముల్లో పురుగు మందుల అవశేషాలను తక్షణమే గుర్తించి విశ్లేషించడానికి ఉపయోగ పడుతుందని, రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారే అవకాశముందని వివరించారు. ఇదే సందర్భంగా, విశ్వవిద్యాల యానికి చెందిన అధ్యాపకులు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. బయోటెక్ విభాగానికి చెందిన డాక్టర్ కే.చంద్రశేఖర్ (హెచ్-ఇండెక్స్-43), ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ మిథున్ రుద్రపాల్(హెచ్ ఇండెక్స్-36) స్కోపస్‌లో అత్యుత్తమ హెచ్-ఇండెక్స్‌ను సాధించినట్లు చెప్పారు. హెచ్ ఇండెక్స్ అనేది పరిశోధకుడి శాస్త్రీయ కృషిని అంచనా వేయడానికి ఉపయోగించే ముఖ్యమైన సూచిక. ఇది పరిశోధకుడు ప్రచురించిన పత్రాల సంఖ్య, ఆ పత్రాలకు లభించిన సైటేషన్లు, పరిశోధన ప్రభావం, సంబంధిత రంగంలో సగటుతో పోల్చినప్పుడు వాటి ప్రాముఖ్యత, రచయిత ప్రొఫైల్ ఖచ్చితత్వం వంటి అంశాల ఆధారంగా నిర్ణయించబడుతుందని వివరించారు. జాతీయ స్థాయి పేటెంట్ సాధించిన పరిశోధన విద్యార్థి అంపసాని చెన్నయ్య, డాక్టర్ కే.చంద్రశేఖర్, అలాగే ఉత్తమ హెచ్-ఇండెక్స్ సాధించిన డాక్టర్ మిథున్ రుద్రపాల్, డాక్టర్ కే,చంద్రశేఖర్‌లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు ప్రత్యేకంగా అభినందించారు.

# బాలల హక్కులు,చట్టాలు,న్యాయ సహాయం వంటి విషయాల పై సదస్సు

**తాడేపల్లి, మే 6, ప్రభాతవార్త:** తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో బుధవారం సాయంత్రం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థవారి చైల్డ్



ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, లైంగిక వేధింపులు, చైల్డ్ అడ్వొకసీ కౌన్సిలింగ్ గురించి చైతన్య బాలల పార్లమెంట్ గ్రూప్ లో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కో ఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ బాలలకు ఉన్న హక్కులు, చట్టాలు,న్యాయ సహాయం ఎలా అందుతుంది లాంటి విషయాలు గురించి గ్రూప్ సభ్యులకు తెలియజేయడం తెలియజేశారు. అందులో భాగంగా బాలల న్యాయవాద మండలాలు అనేవి సమాజ ఆధారిత సంస్థలు, ఇవి వేధింపులకు గురైన పిల్లలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తాయన్నారు . అత్తోట పోతురాజు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందం ప్రకారం 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రధానంగా 4 రకాల ప్రాథమిక హక్కులు కల్పించింది అని ఈ హక్కులు పిల్లల శారీరక, మానసిక, సామాజిక వికాసానికి అవసరమైన కనీస రక్షణను కల్పిస్తాయని చెప్పారు. బాలల హక్కులను ప్రోత్సహించడం అంటే వారి మనుగడ, అభివృద్ధి, భాగస్వామ్యంపై దృష్టి సారిస్తూ బాలల హక్కులను పరిరక్షించడమే అన్నారు.ఈ కార్యక్రమం లో చైతన్య బాలల పార్లమెంట్ గ్రూప్ సబ్యులు, కిశోర బాలికల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# 8 నుంచి శ్రీ స్వామి వారి హనుమజ్జయంతి ఉత్సవాలు

**గుంటూరు విద్య,మే 6, ప్రభాతవార్త :** గుంటూరు పట్టణం కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల08 నుండి 12 వరకు శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవములు నిర్వహించబడుచున్నవి .ఈ కార్యక్రమములో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణ అధికారి టీ. సుభద్ర దేవస్థానం చైర్మన్



మల్లెంపూడి శ్రీనివాసరావుశ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు ధర్మకర్తల మండలి సభ్యులు దీక్షా సమాజం సభ్యులు వారిచే హనుమజ్జయంతి ఉత్సవముల గోడపత్రులు బుక్లెట్స్ ఆవిష్కరించడమైనదిశ్రీ స్వామివారి హనుమజ్జయంతి కార్యక్రమములు ఈనెల 08రాత్రి 7.15 ని.లకు అంకురార్పణ, సహస్ర దీపాలంకరణ సేవ,09 ఉదయం 10.00 గం.లకు లక్ష తులసి పూజ రాత్రి 7.00 గం.లకు గుంటూరు నగరంలో హనుమాన్ దీక్ష స్వాములుచే హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ 10 ఉదయం 10.00 గం.లకు లక్ష మల్లెల పూజ రాత్రి 7.00 గం.లకు సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం11 ఉదయం 10.00 గం.లకు లక్ష ఆకు పూజ మరియు రాత్రి 8.00 గం.లకు శ్రీ హనుమాన్ దీక్షా సమాజం వారి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శ్రీ స్వామి వారి గ్రామోత్సవం జరుగును .12న హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 11.00 గం.లకుశ్రీ స్వామి వారికి సహస్ర ఘట్టాభిషేకం జరుగును రాత్రి 8.00 గం.లకు శ్రీ సువర్చలా ఆంజనేయ స్వామి వారి కళ్యాణం జరుగును 13. ఉదయం 11.00 గం.లకు పూర్ణాహుతి మధ్యాహ్నం 12.00. గం.లకు అన్నదాన కార్యక్రమాలు జరుగును ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి టి సుభద్రదేవస్థానం చైర్మన్మల్లెంపూడి శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహచార్యులు ధర్మకర్తల మండలి సభ్యులు గడదాసు అరుణ, బొల్లి శెట్టి జగదీష్ కుమార్, సందిరెడ్డి గిరిబాబు, యవ్వారం లలిత, తుళ్లూరు కిరణ్ కుమార్, బురుసు దుర్గ, బిట్రా అరుణ కుమారి, గంధం శివయ్య యర్రంశెట్టి గిరి వెంకట ప్రసాద్ రావు, దాసరి పద్మావతి, శ్రీ హనుమాన్ దీక్ష సమాజం సభ్యులు, నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్, మారుతి, వెంకట రమణ, మంశీ ప్రసాద్, బాపి రాజు, కిషోర్ మిర్చియార్డ్ డైరెక్టర్ కొనకల సత్యం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిరువళ్లూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు .

# కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐ కార్మికులకు న్యాయం చేయాలి

## ఆల్ ఇండియా ఎఫ్‌సిఐ వర్కర్స్ సెంట్రల్ కమిటీ మెంబర్ దానబోయిన సుందరరావు యాదవ్

**మంగళగిరి, మే 6, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐ కార్మికులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా ఎఫ్ సి ఐ సెంట్రల్ కమిటీ మెంబర్ దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియాలో డి పి ఎస్, నో వర్క్ నో పే కలిపి 223 ఎఫ్ సి ఐ డిపోలు ఉండగా వాటిలో 119 మాత్రమే పని చేస్తున్నాయని అన్నారు.దీనివల్ల కార్మికులు ఉపాధిని కోల్పోయారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక రంగాలను ఇబ్బందులకు గురి చేయటం సరికాదని అన్నారు. కార్పొరేట్లకు కాంట్రాక్టులను ఇచ్చి కార్మికుల జీవనోపాధి దెబ్బతీస్తున్నారని అన్నారు.ఏపీ లో డిపిఎస్, నో వర్కునో పే డిపోలు 22 ఉండగా వాటిలో 6 మాత్రమే పనిచేస్తున్నాయని అన్నారు. ఎఫ్సీఐ డిపోలు మూతపడే ప్రమాదం ఉందనికార్పొరేట్లకు కాంట్రాక్టులు ఇవ్వడం సరికాదని అన్నారు. మన రాష్ట్రంలో ఎఫ్సీఐ లు అణచివేతకు గురవుతున్నాయని చాలామంది కార్మికులు పనులు లేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు. ఎఫ్ సి ఐ డిపో మిద ఆధారపడి జీవిస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నో వర్క్ నో పే డిపోలు ఆంధ్రప్రదేశ్లో రెండు మాత్రమే ఉన్నాయని పాలకొల్లు కృష్ణ కెనాల్ డిపోఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచి వారికి పని కల్పించాలని కోరుతున్నామన్నారు.



# ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

## అర్బన్ మహిళా ఎస్సై అవ్వారు లక్ష్మీ

**పొన్నూరు, మే 6,ప్రభాతవార్త:** ఈవ్‌టీజింగ్-ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్న విషయాలను విద్యార్థినీ విద్యార్థులు తెలుసుకోవాలని అర్బన్ మహిళా ఎస్సై అవ్వారు లక్ష్మి అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో కళాశాల విద్యార్థులతో



కొద్ది సేపు మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నతులుగా ఎదగాలన్నారు. అంతేకాని ఇతర విద్యార్థులను ఈవ్‌టీజింగ్ చేయడం, ర్యాగింగ్ చేయడం సరైన విధానం కాదన్నారు. అదేవిధంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, హెరాయిన్, ఇతర మత్తు పదార్థాలను వాడకూడదన్నారు. ఎవరైనా ఇలాంటివి ఉపయోగిస్తున్నా, విక్రయిస్తున్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా చదివి సమాజానికి ఉపయోగడపడేవిధంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కానిస్టేబుళ్ళు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెనాలిలో నూతన చలన చిత్రనిర్మాణ సంస్థ "ఆంధ్ర ప్యారీస్" ప్రారంభోత్సవం

**తెనాలి మే6(ప్రభాతవార్త):** నూతన చలనచిత్ర నిర్మాణ సంస్థ "ఆంధ్ర ప్యారీస్"ప్రారంభోత్సవం తెనాలి పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని, ఈ కన్వెన్షన్ హాల్లో "ఆంధ్ర ప్యారీస్" నూతన చిత్ర నిర్మాణ సంస్థ ప్రారంభోత్సవం



కన్నుల పండువగా జరిగింది. తొలుత ఆంధ్ర ప్యారిస్ లోగోను ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ నాయక్ ఆవిష్కరించారు. సంస్థ నిర్మించబోయే కోకిలమ్మ టైటిల్ విజువల్ లోగోను ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రీబూట్ లఘుచిత్ర యూనిట్ కు అభినందన సభ నిర్వహించి, చిత్రంలో సభ్యులకు మెమొంటోలు ప్రదానం చేశారు.ఎఫ్డిసి మేనేజరు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కోకిలమ్మ ఫ్యూచర్ ఫిల్మ్ గొప్ప విజయం సాధించాలని దర్శకులు రత్నాకర్, నిర్మాతలు ఈదర వెంకట పూర్ణచంద్, కుర్రా శ్రీహరి లు పేరుప్రఖ్యాతలు ఘడించాలన్నారు. చిత్ర నిర్మాణానికి అవసరమైన సహాయ, సహకారాలతోపాటు, ప్రభుత్వం నుంచి కావాల్సిన అనుమతులను త్వరితగతిన పొందేలా సహకరిస్తామన్నారు. వీలైనంత త్వరలో చిత్ర నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలని సూచించారు. రచయిత బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ ఆంధ్ర పారిస్ నిర్మాణ సంస్థ పేరుతో నిర్మిస్తున్న కోకిలమ్మ చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. సినిమా రంగంలో రాణించాలని దర్శక నిర్మాతలను అభినందించారు.

# తెనాలి కళాకారులు సినీ రంగంలో రాణించాలి

## సినీ రచయిత బుర్రా సాయి మాధవ్

**తెనాలి మే6(ప్రభాతవార్త):** ఆంధ్రా ప్యారిస్ తెనాలికి కళా రంగంలో ఘన చరిత్ర ఉందని ఆ చరిత్రను కొనసాగేలా ఈ ప్రాంత కళాకారులు ప్రత్యేకతను చాటాలని సినీ స్టార్ రైటర్ బుర్ర సాయి మాధవ్ అన్నారు. స్థానిక బస్టాండ్



సమీపంలోని ఈ కన్వెన్షన్ హాల్ లో నూతన సినీ నిర్మాణ సంస్థ ఆంధ్ర ప్యారిస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోటరీ ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, కుర్ర శ్రీహరి నిర్మాతలుగా ఆంధ్ర ప్యారిస్ పేరుతో సినీ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. సినిమారంగంలో విజయాలు సాధించడం అరుదుగానే ఉంటుందని.పట్టుదల,కృషి తో ఈ నిర్మాణ సంస్థ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.నూతన దర్శకుడిగా కోకిలమ్మ చిత్రం ద్వారా పరిచయం అవుతున్న ఈదర వెంకట పూర్ణచంద్, కథ,మాటలు, స్క్రీన్ ప్లే, ఆర్ట్ బాధ్యతలు వహిస్తున్న రత్నాకర్ కనపర్తి లతో తనకున్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు.చిత్రం యూనిట్ కు అభినందనలు తెలిపారు.తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవల్మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎమ్. శ్రీనివాస్ నాయక్ ప్రభుత్వం కొత్త నిర్మాతలను, దర్శకులను, కళాకారులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోనిర్మించే చిత్రాలకు ఉచితంగా లొకేషన్లు,సబ్సిడీ అందజేస్తుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.దర్శకుడు ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ, సందేశాత్మకంగా కోకిలమ్మ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు.మంచి కథను అందించిన రత్నాకర్ ను ప్రశంసించారు.సహజకవి అయినాల మల్లేశ్వర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు,రోటరీక్లబ్ ఆఫ్ ఆంధ్రప్యారిస్ అధ్యక్షుడు రావి కృష్ణ మోహన్,వివేక విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, అమృతహస్తం ఫౌండర్ కరుణశ్రీ, రోటరీ ప్రముఖులు పాల్గొన్నారు.తొలుత ఆంధ్ర ప్యారిస్ విజువల్ లోగోను శ్రీనివాస్ నాయక్,సాయి మాధవ్,కోకిలమ్మ టైటిల్ లోగోలను ఆవిష్కరించారు. ఈదర టాకీస్ బ్యానర్ పై పూర్ణచంద్ నిర్మాతగా, రత్నాకర్ దర్శకత్వంలో రూపొందిన రీబూట్ లఘు చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచున్న సందర్భం గా చిత్ర యూనిట్ ను సత్కరించారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి,అనురాధ, వెంకటేశ్వరరావు,కన్నెగంటి మురళి కృష్ణ,చేతన్ రాజ్ కొఠారి,గుమ్మడి ప్రసాద్,కొల్లి రాజేంద్ర ప్రసాద్, పలువురు పట్టణ ప్రముఖులు, రోటరీ సభ్యులు నిర్మాత,దర్శకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని కోకిలమ్మ ప్రొడక్షన్ డిజైనర్ ఈదర అమరేంద్ర, కేసన కోటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు లు పర్యవేక్షించారు.

# ప్రధానమంత్రి సూర్యా ఘర్ పథకాన్ని వినియోగించుకోండి

## -మాజీ జడ్పీటీసి సభ్యుడు కోటా శ్రీనివాసరావు

**పొన్నూరు, మే 6,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి సూర్యా ఘర్ పథకం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ పథకంపై అవగాహన కలిగి ఉండాలని మాజీ జడ్పీటీసి సభ్యుడు కోటా శ్రీనివాసరావు



కోరారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో సూర్యా ఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. సోలార్ నెట్ మీటరింగ్ సిస్టమ్ ద్వారా విద్యుత్‌ను ఉపయోగించుకోవచ్చున్నారు. తద్వారా విద్యుత్ బిల్లులో వ్యత్యాసాన్ని పొందవచ్చున్నారు. రూ.3వేలు విద్యుత్ బిల్లు వచ్చేవారికి 3కెడబ్ల్యూపి సోలార్ సిస్టమ్ సరిపోతుందన్నారు. దీని ధర రూ.2.10లక్షలు అవుతుందన్నారు. రూ.78వేలు సబ్సిడీ పోను రూ.1.32లక్షలు 50నెలల్లో లోను పూర్తి చేసుకోవచ్చున్నారు. అప్పటి నుండి నెలకు రూ.3వేలు చొప్పున కనీసం 25సంవత్సరాల పాటు సుమారుగా రూ.9లక్షలు ఆదా అవుతుందన్నారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు సూర్యా ఘర్ పథకంపై అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చెరువులో వ్యర్థాలు వేస్తే జరిమానా

## మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ, మే6,(ప్రభాతవార్త):** పురపాలకసంఘ చెరువుల్లో చెత్త ఇతర వ్యర్థాలు వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు హెచ్చరించారు.బుధవారం పట్టణంలోని 37వ వార్డులోని రజక చెరువును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్త ఇతర వ్యర్థాలు శుభ్రం చేయించారు.



ఆ ప్రాంతంలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 37 వ వార్డు పాటి కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు.కాలువలలో ఉన్న సిల్ట్ ను పూర్తిగా తొలగించాలని సిబ్బందికి సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగానే పట్నంలోని ప్రధాన, మధ్యస్థ కాలువలలో సిల్ట్ ను తొలగిస్తున్నట్టు చెప్పారు. కాలువలలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని అన్నారు.కమీషనర్ వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరంలో మెడిటేషన్ కార్యక్రమం

**అమరావతి,మే6,ప్రభాతవార్త :** శాఖ గ్రంధాలయంలో వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. విద్యార్థులకు మెడిటేషన్ క్లాసులు సూర్య నమస్కారాలు కథలు చెప్పడం చదవడం వినడం ఆట్లాడతం ఆరోగ్యం పట్ల



జాగ్రత్తలు ఎడ్యుకేషన్ విషయంలో కంప్యూటర్ క్లాసెస్ నిర్వహిస్తున్నారని గ్రంథాలయ అధికారి వెంకాయమ్మ తెలిపారు. అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులు, జీకే వివరించేందుకు ప్రత్యేక టీచర్లు వస్తున్నారని ఆమె అన్నారు. వేసవికాలంలో ఇంటికే పరిమితం కాకుండా విజ్ఞాన క్లాసులకు విద్యార్థులు హాజరు కావాలని ఆమె అన్నారు.

# మండల విద్యాశాఖ అధికారుల సమిష్టి కృషితో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెరగాలి

**గుంటూరు విద్య, మే6, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు అందరూ సమిష్టి కృషితో ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలని గుంటూరు పాఠశాల విద్యా జోన్ 3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి లింగేశ్వర్ రెడ్డి అన్నారు గుంటూరు నగరంలోని శ్రీ చలమయ్య జూనియర్ కాలేజీలో గుంటూరు జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు మరియు మండల విద్యాశాఖ అధికారితో సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు ఉప విద్యాశాఖ అధికారులు మరియు జిల్లాలోని అందరు ఎంఈఓ లు ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన ఉత్తీర్ణతను తల్లిదండ్రులు తెలియజేసి దాని ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, తమ మండల పరిధిలోని అంగన్వాడీలో చదివిన విద్యార్థు లందరిని ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని, ఏ ఒక్క విద్యార్థి డ్రాప్ అవుట్ లేకుండా చూసుకోవాలని , 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తప్పిన విద్యార్థులందరూ పాఠశాలకు హాజరై ప్రభుత్వము అందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్ ను అందించి అందరు విద్యార్థులు నూరు శాతం పాస్ అయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను సన్నద్ధము చేయాలని, పాఠశాల యాజమాన్య కమిటీ మరియు తల్లిదండ్రుల సహకారంతో స్వచ్ఛందంగా ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, గత సంవత్సరం ప్రభుత్వపాఠశాలలో చదివిన ఏ ఒక్క విద్యార్థి డ్రాప్ అవుట్ కాకుండా చూసుకోవాలని, ప్రభుత్వము ప్రభుత్వ పాఠశాల కల్పిస్తున్న సదుపాయాలు, మరియు ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు తెలియజేసి దాని ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని, రాష్ట్రంలోనే గుంటూరు జిల్లా విద్యాపరంగా అన్ని రంగాల్లో ముందుండే విధంగా సమిష్టిగా కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి యేసు రత్నం, ఉప విద్యాశాఖ అధికారి శాంతకుమారి మరియు జిల్లాలోని అందరు మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు



# అవగాహనలో దర్శక శిఖరం యుగకర్త దాసరి జయంతి

**గుంటూరు కల్చరల్,మే 6,ప్రభాతవార్త :** తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉన్నంతకాలం నిలిచిపోయే మేరు నగధీరుడు దాసరి నారాయణరావు దాదాపు 150చిత్రాలకు పైగా దర్శకత్వం వహించి అనేక దిగ్విజయాలను అందించిన దాసరి పేరు సినీచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అవగాహన మనమూ పాడుదాం రండి బృందసభ్యులు నివాళులర్పించారు.సంస్థ కార్యాలయంలో దర్శకులు,నటులు దాసరి నారాయణరావు జయంతి కార్యక్రమం జరిగింది.సీనియర్ గాయకులు,విశ్లేషకులు రత్నాజీ మాట్లాడుతూ కథ,మాటలు,పాటలు,నిర్మాణం,దర్శకత్వం,నటన అన్నింటినీ ఒక్కచేత్తో సమర్థవంతంగా నిర్వహించగల బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి అన్నారు.కళాసాధ అధ్యక్షులు బిళ్ళా అశోక్ మాట్లాడుతూ తెలుగు సినిమా కథను కొత్తపుంతలు తొక్కించిన దర్శకుడు దాసరి అని ఆయన సినిమాల్లో సామాన్యడే కథా నాయకుడన్నారు.కార్యక్రమంలో దాసరి సినిమాల్లోని పాటలను గాయనీ గాయకులు రాజశేఖర్,భాగ్యలక్ష్మీ,మల్లేశ్వరరావు,సాయిబాబ లు ఆలాపించారు.

# పెదనందిపాడులో భగవాన్ శ్రీ సత్యసాయి తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి వేడుకలు

**పెదనందిపాడు, మే 6, (ప్రభాతవార్త):** పెదనందిపాడు భగవాన్ శ్రీసత్య సాయి బాబా భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయి మందిర్లో శ్రీ సత్య సాయి బాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా గత వారం రోజుల నుంచి బాల వికాస్ విద్యార్థులచే పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి . బాల వికాస్ విద్యార్థులచే వారి తల్లులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వికాస్ టీచర్ బి ధనలక్ష్మి. కె రమ. ఎన్ మణిమాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా వారం రోజుల నుండి బాలవికాస్ విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా భజన మండలి కన్వీనర్ వి విద్యాసాగర్ గుప్తా. కోకన్వీనర్ అరవపల్లి రామ సుబ్బారావు లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బజన విభాగం సభ్యులు రావిపూడి సుజాత. నున్న లక్ష్మి . కె పద్మజ . సాయి మందిర్ ఉపాధ్యక్షులు తడవర్తి సురేష్ బాబు.కమిటీ సభ్యులు సకలా వీరేంద్ర గుప్తా. రావిపూడి అర్జునరావు . పత్తి రామారావు. ఇంటూరి వెంకటేశ్వర్లు. దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నేడు మర్రిపాలెంలో గ్రామసభ



**యడ్లపాడు,మే6,ప్రభాతవార్త :** ప్రభుత్వం నూతనంగా రూపకల్పన చేసిన ఒక నెల ఒక గ్రామం నాలుగు పర్యటనలు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. గ్రామాలను రెవెన్యూ వివాద రహితంగా మార్చే లక్ష్యంతో రెవెన్యూ ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించటం కోసం ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామసభలు పెట్టి సమస్యలను గుర్తించి వాటిని వేగంగా పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా నెలకు ఒక గ్రామాన్ని ఎంచుకుని వారానికి ఒకసారి సంబంధిత గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. నాలుగు గ్రామసభల్లో వరుసగా.. దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ, సమస్యల పరిష్కారిస్తామన్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని మర్రిపాలెంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్వోఆర్, వెబ్‌ల్యాండ్, సరిహద్దు, దారి వివాదాలు, సదాబైనామా క్లెయిమ్లు, నోషనల్ ఖాతాలు, రెవెన్యూ పరమైన కుటుంబ సభ్యుల వివాదాలు, భూఆక్రమణలు, ఇతర రెవెన్యూకు సంబంధించి దరఖాస్తులు అందజేయవచ్చని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## వైభవంగా శ్రీ గంగా పార్వతీ సమేత రాజారాజేశ్వరి ఆలయం 9వ వార్షికోత్సవం



**యడ్లపాడు,మే6,ప్రభాతవార్త :** యడ్లపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వరి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులను ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. కన్నుల పండుగగా నిర్వహించిన స్వామివారి శాంతి కళ్యాణంలో ముత్తవరపు సురేష్బాబు, అరుణకుమారి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్తవరపు సురేష్బాబు రూ. లక్ష విలువైన బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు స్వామివారికి సమర్పించారు. కల్లూరి స్నేహశ్రీ రూ.10 వేల విలువైన పూజా సామగ్రి వితరణ చేసింది. వేలాది మందికి అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షించారు.

## చెల్లని చెక్కు కేసులో నిందితునికి 6 నెలలు జైలు, రూ. 8 లక్షలు అపరాధ రుసుం

**సత్తెనపల్లి, మే 6, ప్రభాతవార్త:** చెల్లని చెక్కు కేసులో ముద్దాయి కి ఆరు నెలలు జైలు శిక్ష, 8 లక్షలు అపరాద రుసుము విధిస్తూ సత్తెనపల్లి మొదటి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ), సత్తెనపల్లి న్యాయమూర్తి పి. ప్రియదర్శిని మంగళవారం చెక్కు బౌన్స్ కేసులో తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... సత్తెనపల్లి పట్టణానికి చెందిన కొల్లా గోపాలరావు దగ్గర పట్టణానికి చెందిన కట్టా శ్రీలక్ష్మి పదిలక్షల రూపాయలు నగదు 2016 సంవత్సరములో అప్పుగా తీసుకోని ప్రామిసరీ నోటు రాయడం జరిగింది. సదరు గోపాలరావు బాకీ గురించి పలుమార్లు కట్టా శ్రీలక్ష్మి ని అడుగగా బాకీ క్రింద చెల్లుగా (జమగా )రు నాలుగు లక్షల రూపాయలు ది 18 నంవంబర్ 2017 న ఆంధ్రబ్యాంక్ చెక్కును శ్రీలక్ష్మి, గోపాలరావు కు ఇవ్వగా దాన్ని ఈ కేసులో పిర్యాదు దారుడు తన అప్పటి విజయ బ్యాంక్ లో తన అకౌంట్ లో సదరు చెక్కు నగదు డ్రా కోసం ప్రెజెంట్ చేయగా సదరు చెక్కు బౌన్స్ అయ్యింది. వెంటనే పిర్యాదుదారుడు సత్తెనపల్లి లో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం లో చెక్కు బౌన్స్ కేసు దాఖాలు చేయగా సుధీర్గ విచారణ అనంతరం న్యాయమూర్తి పి. ప్రియ దర్శిని ముద్దాయి పై నేరం రుజువు కావటంతో నిందితునికి ఆరు నెలలు జైలు శిక్ష, 8లక్షల రూపాయలు అపరాధ రుసుము చెల్లించాలని తీర్పు ఇచ్చారు. అపరాద రుసుము రెండు నెలల్లో చెల్లించాలని, చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.

## సత్తెనపల్లిలో ది గాయత్రి కోపరేటివ్ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించిన 'దరువూరి'



**సత్తెనపల్లి, మే 6, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణంలో బుధవారం గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ సత్తెనపల్లి కొత్త బ్రాంచ్ ను పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువురి నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సత్తెనపల్లి ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త బ్యాంకు సేవలను అందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానని. అలాగే, ఈ బ్యాంకు సిబ్బంది అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు.

## నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల పర్యటన



సత్తెనపల్లి, మే 6, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 10వ వార్డు నందు పగడాల ఆంజనేయులు విజయలక్ష్మి కుమారుడు పవన్ కళ్యాణ్ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు , మాజీ కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి) , వల్లెం నరసింహారావు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంజీవ్‌నగర్‌లో ప్రవహిస్తున్న మురుగునీరు



చిలకలూరిపేట, మే 6,ప్రభాతవార్త: చిలకలూరిపేటలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పట్టణంలోని సంజీవనగర్ లో వర్షం నీరు ,మురుగు నీరు ప్రవహిస్తుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఈ కాలనీలో వర్షం ఎప్పుడు కురిసినా మురుగునీరు ప్రవహిస్తుంటుంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కాలనీ ని పట్టించుకోవట్లేదని స్థానికులు తెలిపారు. జాతికి రహదారికి ఆనుకుని ఉన్న పెద్ద కాలువ ని మరమ్మత్తులు చేయాలని, మురుగునీరు కాలనీలోకి రాకుండా అధికారులు పట్టించుకోవాలన్నారు. మురుగు నీరు వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని కాలనీ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## వివాదాస్పద భూమిని పరిశీలించిన తహాశీల్దారు

**మాచర్ల, మే 6 ప్రభాతవార్త:** తనకు ఇచ్చిన భూమిని పోర్జరీ సంతకాలతో ఆక్రమించుకున్నారని తనకు న్యాయం చేయాలని మాచర్ల విజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించడంతో మాచర్ల తహాశీల్దారు కిరణ్‌కుమార్ ఆ భూమిని పరిశీలించారు. మాచర్ల గ్రామంలోని సర్వే నెం.1348లో ప్రభుత్వ భూమిని ఎస్సీ కులానికి చెందిన వారికి ఇంటి నివేశన స్థలం కేటాయించుటకు ప్రభుత్వం రిజర్వు చేశారు. పోర్జరీ సంతకాలతో పట్టాలు తయారు చేసి ఆక్రమించుకున్నారని బాధితుడు పేర్కొన్నాడు. స్థల పట్టాలు పోర్జరీ



చేసిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తహాశీల్దారు వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయరు, హౌసింగ్ ఏఈ, గ్రామ రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. సదరు పట్టాలను పొందిన వారిని ఒరిజినల్ పట్టాలను తహాశీల్దారు కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం తగు చర్యలు తీసుకోవడానికి కలెక్టరుకు నివేదిక అందజేయనున్నట్లు తహాశీల్దారు కిరణ్‌కుమార్ తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## జిల్లాలో ఒక నెల,ఒక గ్రామం, 4పర్యటనలు : జాయింట్ కలెక్టర్



**నరసరావుపేట,మే6,ప్రభాతవార్త:** జిల్లాలో "వన్ మంత్... వన్ విలేజ్... 4 విజిట్స్" కార్యక్రమాన్ని ప్రతీ నెల ఒక గ్రామంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ సంజన సింహా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం "వన్ మంత్... వన్ విలేజ్... 4 విజిట్స్" కార్యక్రమం నిర్వహణపై రెవిన్యూ అధికారులకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రధానంగా రెవిన్యూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం "వన్ మంత్... వన్ విలేజ్... 4 విజిట్స్" కార్యక్రానికి రూపకల్పన చేసిందన్నారు. మండల తహసీల్దార్లు తమ పరిధిలోని గ్రామాలలో నెలకు ఒక గ్రామంలో వారానికి ఒక రోజు చొప్పున 4 రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించి, ఆ గ్రామంలో సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా పనిచేయాలన్నారు. ముందుగా మండల పరిధిలో రెవిన్యూ, ఇతర శాఖలకు సంబందించిన సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాన్ని గుర్తించాలని, రీ సర్వే జరిగిన గ్రామానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈనెల 7వ తేదీ గురువారం ఆ గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను గుర్తించాలని, అనంతరం ఆ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల నుండి రెవిన్యూ, తదితర అంశాలపై వారి సమస్యలకు సంబందించిన వినతి పత్రాలను స్వీకరించి, వాటిల్లో అక్కడికక్కడే పరిష్కరించే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 3వ గురువారం ప్రజల ఫిర్యాదులకు సంబంధించి మ్యుటేషన్, ఆర్ ఓ ఆర్ సవరణలు, తదితర ఫిర్యాదుల పరిష్కారం చర్యలను ఫిర్యాదీదారులకు తెలిజేసి, సంబంధింత ఉత్తరువులను అందించాలన్నారు. 4వ గురువారం పరిష్కార విధానంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. కోర్ట్ లలో పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల మినహా గ్రామంలో రెవిన్యూ సమస్యలు లేకుండా పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమాన్ని ఈనెల 7వ తేదీ గురువారం నుండి జిల్లావ్యాప్తంగా ప్రతీ మండలంలోనూ ఒక గ్రామంలో ప్రారంభం కావాలన్నారు. "వన్ మంత్... వన్ విలేజ్... 4 విజిట్స్" కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఏ నెలలో ఏ గ్రామంలో నిర్వహించేది ముందుగానే ప్రజలకు సమాచారం అందించాల ని జాయింట్ కలెక్టర్ సంజన సింహా ఆదేశించారు.

## చిలకలూరిపేటలో స్కూల్ బస్సుల ఆకస్మిక తనిఖీ



**చిలకలూరిపేట, మే 6,ప్రభాతవార్త:** విద్యార్థుల భద్రతే లక్ష్యంగా చిలకలూరిపేటలో రవాణా శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్ ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (లీజు) ఎన్. గోపాల్ పలు స్కూల్ బస్సులను నిశితంగా పరిశీలించారు. ప్రధానంగా బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎమర్జెన్సీ డోర్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, వీఎల్‌టీడీ మరియు పానిక్ బటన్ల పనితీరును తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని బస్సులకు నోటీసులు జారీ చేస్తూ, వారం రోజుల్లోగా లోపాలను సరిచేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని, ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## విశాఖ రైల్వే జోన్..ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి ఆలోచనల కార్యరూపంలో మరో ప్రధాన అడుగు : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, మే 6, ప్రభాతవార్త:** విశాఖ రైల్వే జోన్ కు గెజిట్ నోటిఫికేషన్, ఇవి రెండూ డబుల్ ఇంజిన్ సర్కార్..రాకెట్ స్పీడ్ వేగానికి, ఢిల్లీ, అమరావతి పాలకుల వేగవంతమైన సుస్థిర పాలనకు గీటురాళ్లు అనే చెప్పాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ తో, రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆలోచనల కార్యరూపంలో మరో ప్రధాన అడుగు పడినట్టైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కృషి, పరస్పర సహకారం వల్లే 1 జూన్ 2026 నుంచి అమల్లోకి విశాఖ డివిజన్ కేంద్రంగా నూతన రైల్వే జోన్. 2014 విభజన చట్టం హామీల్లో మరో ప్రధాన వాగ్దానం అమలుపై ప్రజల్లో హర్షాతిరేకాలు. ఈ తరహా రవాణా వ్యవస్థలతో పాటు.. కేంద్రం ఇబ్బడిముబ్బడిగా రాష్ట్ర ప్రగతికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని, అప్పుడే ప్రధాని మోదీ చిరకాల స్వప్నమైన వికసిత్ భారత్ లో ఏపీ కీలక భూమిక పోషించగలుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.కొత్త జోన్ తో ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్ లకు అనుసంధానిస్తూ ధృఢమైన రైల్వే కారిడార్ కొత్త జోన్ తో పాటు.. ప్రత్యేక వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల కేటాయింపుతో రాష్ట్ర రైల్వే వ్యవస్థ మునుపెన్నడూ లేని విధంగా బలోపేతం అవనుందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలతో పాటు.. పారిశ్రామిక అభివృద్ధికి మార్గం సుగమం కానుంది. రాష్ట్రంలోని ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్ లను అనుసంధానిస్తూ ధృఢమైన, విశాలమైన సరికొత్త రైల్వే కారిడార్ ఏర్పడనుంది. చౌకైన, సౌకర్యవంతమైన, మెరుగైన రైల్వే ప్రయాణ సౌకర్యంతో పాటు భారీ సరుకు రవాణా వ్యవస్థ ప్రజలకు అందుబాటులోకి రానుంది. కొత్త జోన్ పరిధిలో 74 స్టేషన్ల ఆధునికీకరణతో పాటు.. 1039 కి.మీ. మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది." అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

## పట్టణంలో 2 రోజులపాటు నీటి సరఫరా బంద్

**నరసరావుపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో రెండు రోజులపాటు త్రాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. పట్టణ త్రాగునీటి సరఫరా విభాగానికి సంబంధించి రావిపాడు రోడ్ లో ఉన్న ప్రధాన పైప్ లైన్ కు లీకేజీలు ఏర్పడ్డాయి అన్నారు. త్రాగునీరు వృథా అవుతున్నాయని, అరికట్టేందుకు అత్యవసరంగా పైప్ లైన్ లీకులు మరమ్మత్తుల నిర్వహించాల్సి వచ్చింది అన్నారు. మరమ్మత్తుల కారణంగా ఈ నెల 7వ తేదీన గురువారం సాయంత్రం, 8వ తేదీ శుక్రవారం ఉదయం పట్టణంలో త్రాగునీటి సరఫరా ఉండదన్నారు. ఎనిమిదో తేదీ సాయంత్రం నుండి పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు యధావిధిగా త్రాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించి మంచినీరు పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ రమ్య కీర్తన సూచించారు.

## చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి

**రొంపిచర్ల,మే6,ప్రభాతవార్త :** రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో వైయస్సార్ సీపి జిల్లా వర్కింగ్




ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ 25 సంవత్సరాలు పూర్తి అయినా శుభ సందర్భంగా సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి పాల్గొన్నారు. శాంతి,ప్రేమ బోధించే చర్చిని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని డాక్టర్ కోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మత విశ్వాసులు, గ్రామ పెద్దలు, వైఎస్ఆర్సిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు. ..గ్రామంలో పార్టీ కార్యకర్తలను పరామర్శించిన డాక్టర్ గోపిరెడ్డి.. కొనకంచివారిపాలెం గ్రామంలో పర్యటించిన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బుధవారం గుండాల కోటేశ్వరరావు ను పరామర్శించారు. పెరాల్సిస్ తో బాధపడుతున్న సంగతి తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వెంట వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## 31వ మహాసభను జయప్రదం చేయండి

**నకరికల్లు మే6, ప్రభాతవార్త :** మే 10న నరసరావుపేటలో జరగనున్న పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ 31వ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య కోరారు. ఈ మేరకు బుధవారం అరండలపేటలోని ఏంజెల్ టాకీస్ వద్ద నున్న యూనియన్ ఆఫీస్ ఆవరణలో పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ మహాసభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ, నాగార్జునసాగర్ రైట్ కెనాల్ పరిధిలోని లస్కర్లు, వర్క్ ఇన్స్పెక్టర్, ఉమెన్ మజ్దూర్ లు, వాచ్ మెన్స్ అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, యూనియన్ కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సూరి, వెంకట్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ



**నరసరావుపేట, మే6, ప్రభాతవార్త :** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం అమరావతి రాజధానిలో మంత్రి నారా లోకేష్ తో భేటీ అయ్యారు. ఈ భేటీలో నియోజకవర్గంలో నెలకొన్న పలు కీలక సమస్యలను, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పలు వినతిపత్రాలను మంత్రి లోకేష్‌కు సమర్పించారు. నరసరావుపేటలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, జేఎన్టీయూ కాలేజీకి సంబంధించిన సమస్యల పరిష్కరించాలని కోరారు. ఆటో నగర్ అభివృద్ధి, నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూమి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచేలా అధికారులకు సూచనలు ఇవ్వాలని మంత్రిని కోరారు. పార్టీ బలోపేతంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపైనా ఇరువురి మధ్య కీలక చర్చలు జరిగాయి. వినతిపత్రాలను పరిశీలించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు.

## శ్రీ బావన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఛీఫ్‌విప్ జీ.వీ దంపతులు



**ఈపూరు, మే6, ప్రభాతవార్త:** మండలంలోని ఇనుమెళ్ళ గ్రామంలోని శ్రీ బావన్నారాయణ స్వామి దేవాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు,అభివృద్ధి కోసం హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీ.వీ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నూజెండ్ల ఎంపిడివోగా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరణ

**నూజెండ్ల,మే6,ప్రభాతవార్త:** నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సింగంశెట్టి సత్యనారాయణ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం నుండి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో సత్యనారాయణ మాట్లాడుతూ



మండలంలో ప్రజా ప్రతినిధులు,అధికారులను కోఆర్డినేషన్ చేసుకొని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను స్వర్ణ గ్రామ డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జునరావు,ఏపీవో ఆంజనేయరాజు,పంచాయతీరాజ్ ఏఈ అల్లాబక్షు,మండల స్థాయి నాయకులు,పంచాయతీ కార్యదర్శులు,కార్యాలయ సిబ్బంది,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## గోపాలంవారిపాలెం పాఠశాలలో 'బడిబాట'

**చిలకలూరిపేట, మే 6,ప్రభాతవార్త:** చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని



సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, చిన్నారులతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న నాణ్యమైన విద్య, వసతులను వివరించిన ఆమె, ప్రతి బిడ్డను బడికి పంపాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కలెక్టర్ స్వయంగా విద్యార్థుల చదువుల గురించి అడిగి తెలుసుకోవడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది.

## కొలతల ప్రకారం పని చేయండి : ఎంపీడీఓ

**పెదకూరపాడు,మే6,ప్రభాతవార్త:** లగడపాడు రోడ్ లోని ఎస్ మైనర్ పరిసర ప్రాంతాల్లో పంట పొలాలకు వెళ్లే కాలవలా పూడుక తీత పనులు ఉపాధి కూలీలు బుధవారం చేపట్టారు. ఎంపీడీవో సాయి లీల పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాస్టర్ రోల్ ప్రకారం పని కోరబడిన కూలీలు మాత్రమే పనిలో పాల్గొనాలని ఒకరు పేరు మీద మరొకరు



రాకూడదన్నారు. పనికి తగ్గ వేతనం లభిస్తుందని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం వినియోగించుకొని కరువు సమయంలో పేదలు నిర్భయంగా జీవించాలని ఆమె కోరారు. పరస గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఎంపీడీవో సాయి లీల చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కోటమ్మ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

